

సామాజిక న్యాయ మార్గంలో నడవాలి : జెసి

కడప : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'సామాజిక సమత సంకల్పం' జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో స్ఫూర్తిని నింపుతోందని ప్రతి ఒక్కరినీ సామాజిక న్యాయ మార్గంలో నడిపించేందుకు ఈ కార్యక్రమం ప్రేరేపిస్తుందని జెసి జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెసి హాజరై కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి నిలువెత్తు ప్రతిరూపంగా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని 20 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనంలో ఏర్పాటు చేశారని చెప్పారు.

కోలాటం ఆడుతూ నిరసన

- 32వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

కడప అర్బన్ : జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టరు చేపట్టిన దీక్షలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్, అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు, అంగన్వాడీలు అంజనీ దేవి, వసుంధర, మెర్సీ, ప్రసన్న, అభిబ్, పద్మ దీక్షల్లో కూర్చున్నారు సిఐటియు జిల్లా, నగర అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, బి చంద్రారెడ్డి, నాయకులు ఉదయ్ పవన్, దస్తగిరి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద అంగన్వాడీలు 'మాకు బేడీలు వేయండి' అని ఆందోళన చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, పద్మ, విజయ, సువార్తమ్మ, రాణి, గురుదేవి, శివమ్మ, కృష్ణవేణి, అర్బన్ సెంటర్ల అంగన్వాడీలు, మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ అంగన్వాడి వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **మైదుకూరు :** అంగన్వాడీలు 32 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అంగన్వాడీ కార్యకర్తలు అన్నారు. చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం అమలు, గ్రాడ్యుటి అమలు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేసే జీవోను విడుదల చేయాలని అంగన్వాడీ సంఘాల నాయకులు ధనలక్ష్మి, భారతి, చెన్నమ్మ ,లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం 32వ రోజు సమ్మె జరుగుతున్న నేపథ్యంలో అంగన్వాడి కార్యకర్తలు మైదుకూరు సిడిపిఓ కార్యాలయం ఎదుట 32 అంకె రూపంలో కూర్చుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనురాధ, రిజ్వానా, అన్నపూర్ణ, మంజుల శ్రీదేవి, సాయి లక్ష్మి, రాధా, రామతులసి, శ్యామల పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను అణచివేసేందుకు నోటీసులు ఇచ్చి సమ్మెను ఆపాలని ప్రయత్నం చేస్తుందని, తాము నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపేది లేదని జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడి యూనియన్(సిఐటియు) నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 32 రోజుకు చేరడంతో కోలాటం ఆడుతూ వినూత్న రీతిలో అంగన్వాడీలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జమ్మలమడుగు సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, సిపిఎం పట్టణ కార్యదర్శి యేసుదాసు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ బాధ్యులు వినయ్ కుమార్, నరసమ్మ, కులాయమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.



జమ్మలమడుగు : కోలాటం ఆడుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



ప్రొద్దుటూరు : పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేద్దాం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికలలో అన్ని విభాగాలు కలిసి సమర్థవంతంగా పని చేద్దామని ఎస్పి సిద్దార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు, సెబ్, ఆర్‌టిఎ, అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేలా ప్రణాళికా బద్ధంగా అన్నిరకాల ముందస్తు చర్యలు చేపడదామన్నారు. స్టాటిక్ చెక్ పోస్టులు, డైనమిక్ చెక్ పోస్టులలో సమన్వయంతో పని చేద్దామన్నారు. బెల్టు దుకాణాలు జిల్లాలో ఉండకూడదని, అక్రమంగా నగదు, బంగారు ఆభరణాల తరలింపు ఉండకూడదని తెలిపారు. ఎన్‌డిపిఎల్, డి పి ఎల్ నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని పేర్కొన్నారు. ఉన్నది ఉన్నట్లు సీజ్ చేసి వేగవంతంగా డిస్పోజల్ చేయాలని చెప్పారు. కేసు నమోదు, నిందితుల అరెస్టు అంతా చట్టపరంగా ఉండాలని పేర్కొన్నారు. నాటు సారా, గంజాయి సీజ్ చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న నగదు సీజ్, తదనంతర ప్రక్రియ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అటవీశాఖ పరిధిలోని మెటీరియల్ కూడా అక్రమంగా రవాణా జరగరాదన్నారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పి కె.ప్రవీణ్ కుమార్, ఇన్‌ఛార్జి డిటిసి మురళీ, అటవీ, రవాణా, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రాచమల్లు'పై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో లిక్కర్ ను పోలీసులు పట్టుకుంటే, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఎస్పిని దుర్భాషలాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాచమల్లుపై సుమోటాగా కేసు నమోదు చేయాలని ఎస్పి విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఇష్టానుసారంగా, అధికారులను, నిలబెట్టి, వారి కుర్చీల్లో కూర్చుని మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. అధికారులు రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తామని, వైసిపి నేతలపై తిరగబడకుంటే రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక, ఆ పార్టీ నేతల భూ కబ్జాలు పెచ్చు మీరిపోయాయని, ఖాళీ జాగాలను వదలలేదని, బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేసిన పట్టించుకునే వారే లేరన్నారు. ఈ చట్టం వల్ల సన్నకారు రైతులు, దళితులు, బిసి వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం టిడిపిజిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు వైసిపి ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టం, ల్యాండ్ సైటరింగ్ యాక్ట్ రద్దుకు, తమ వంతు కృషి చేయాలని శ్రీనివాస రెడ్డికి విజ్ఞాపన పత్రం అందించారు.

సత్వర చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మినీ ఫిష్ కియాస్క్ కేంద్రం ఏర్పాటు చేసుకొని ఎందుకు దరఖాస్తు చేసుకున్న వారికి కమిటీ లబ్ధిదారులుగా ఎంపిక చేశామని, అమలు కోసం సత్వర చర్యలు తీసుకోవాలని కడప జిల్లా ఉప మత్స్యశాఖ సంచాలకున్ని కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఐదవ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యువజన పథకం కింద 40 శాతం రాయితీతో 50 లక్షల యూనిట్ విలువ కలిగిన చేప రొయ్యల, చేపల విక్రయ కేంద్రాలు లైవ్ ఫిష్ వెండింగ్, మినీ ఫిష్ కియాస్క్ కేంద్రం (1)ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి కమిటీ లబ్ధిదారులుగా ఎంపికలు పూర్తయ్యాయని చెప్పారు.

విభిన్న ప్రతిభావంతుడికి పింఛన్ అందజేత

ప్రజాశక్తి - కడప

విభిన్న ప్రతిభావంతుడైన ఎనిమిది సంవత్సరాల వయసు గల తరుణ్ కుమార్‌కు ప్రభుత్వం పింఛన్‌ను మంజూరు చేసింది. శుక్రవారం బాలుడి తల్లిదండ్రులకు పింఛను వెల్ఫేర్ సెక్రటరీ అశోక్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లె పూసల వీధికి చెందిన వి. రాంప్రసాద్ దంపతులకు వి. తరుణ్ కుమార్ ఒక్కడే కుమారుడు. పుట్టుక నుంచే మానసిక వికలాంగుడు. తండ్రి బైక్ మెకానిక్ గా పని చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. తల్లి గృహిణి. తమ కుమారుడుకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ తమ కుటుంబానికి ఎంతో ఉపయోగకరమని తల్లిదండ్రులు తెలిపారు. పింఛను మంజూరు కావడానికి వెల్ఫేర్ సెక్రెటరీ అశోక్ కుమార్ కృషి ఎంతో ఉందని చెప్పారు. జీవనోపాధి కోసం అనంతపురం నుంచి కడపకు వలస వచ్చామని తెలిపారు.



పింఛన్‌ను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ అశోక్‌కుమార్



ఆర్‌డిఒకు సమస్యలు విన్నవిస్తున్న సుగుమంచిపల్లె వాసులు

అందరికీ న్యాయం చేయండి

- ఆర్‌డిఒకు సుగుమంచిపల్లె వాసుల వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోట ప్రాజెక్టు ద్వారా నష్టపోతున్న సుగుమంచిపల్లె గ్రామ ప్రజలందరికీ న్యాయం చేయాలని ఆగ్రామ ప్రజలు ఆర్‌డిఒ జి. శ్రీనివాసులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం వారు ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ముంపునకు గురైన 22 గ్రామాలలో తమ గ్రామం ఒకటన్నారు. కొంత గ్రామాన్ని ముంపునకు కేటాయించి, మిగిలిన కొంత భాగానికి కేటాయించలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు వల్ల నీటి ఊటలు ఇళ్లల్లో పడుతు న్నాయని, మహిళలు మరుగుదొడ్లు వాడుకోలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈనేపథ్యంలో సుగుమంచిపల్లి గ్రామాన్ని కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ తమ గ్రామాన్ని సందర్శించారని చెప్పారు. గత డిసెంబర్ 26న తహశీల్దార్ గ్రామంలోని ప్రతి ఇంటినీ పరిశీలించి అందరి పేర్లు రాసుకున్నారని పేర్కొన్నారు. మళ్లీ విఆర్‌ఒ పెద్దన్న, ఆయన బృందం వచ్చి ఒక లిస్టు ఆర్‌డిఒ కార్యాలయం నుంచి వచ్చిందని చెప్పి అందులో ఉన్న వారి నుంచి బాండుపై సంతకాలు తీసుకుని వెళ్తున్నారని చెప్పారు. లిస్టులో చాలా మంది పేర్లు రాలేదని, అందరికీ న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆర్‌డిఒ గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గ్రామాల మాదిరి మీ గ్రామానికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదన్నారు. ప్రాజెక్టు నిండా నీరు నింపడం వల్ల ఇబ్బందులకు గురవుతున్న కుటుంబాలను, ఇళ్లను పరిశీలించి గుర్తించిన వారికి కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పెషల్ ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లారన్నారు. ఆ మేరకు తాము పని చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని వారందరూ ముంపు గ్రామాల మాదిరిగా తమకు కూడా నష్టపరిహారం చెల్లించాలని, ఇళ్లను సర్వే చేయించాలని, ఆర్ అండ్ ఆర్ పూర్తి ప్యాకేజీ ఇవ్వాలని కోరుతుండడంతో ప్రస్తుతం పూర్తిగా లిస్టును నిలిపేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరికి ఒక్క పైసా కూడా ఇవ్వమన్నారు. మళ్లీ మొదటి నుంచి సర్వే చేసి బాధితులకు న్యాయం చేయమని కలెక్టర్ ఆదేశిస్తే తర్వాత మీ గ్రామానికి వస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీర శేఖర్ రెడ్డి, గోవర్ధన్, చంద్ర శేఖర్ రెడ్డి వెంకట కృష్ణారెడ్డి, సిద్దయ్య, రాజు, ప్రసన్న, భాస్కర్, సురేంద్ర, చిన్నా, బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర ప్రదేశ్ భూ హక్కు చట్టం –2022 ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాలోని కడప బార్ అసోసియేషన్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (న్యాయవాదుల సంఘాలు), బార్ అసోసియేషన్ ల అధ్యక్ష కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సీనియర్, న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు కడప కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, దేవగుడి నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, అబిద్ హుస్సేన్, నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ భూ హక్కు చట్టం వల్ల ప్రజల స్థిరాస్తి హక్కులకు భంగం వాటిల్లుతుందని అన్నారు. సివిల్ కోర్టు ఒరిజినల్ జూరిస్ డిక్షన్‌లో, హైకోర్టులో, సుప్రీంకోర్టులో దాఖలు చేయు వాజ్యములను కూడా ఈ చట్టం ద్వారా తీసివేయడం జరుగుతుందన్నారు. ఈ ట్రిబునల్ వ్యవస్థ ద్వారా ప్రజల ఆస్తి హక్కులు పెత్తందారులు, రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఈ చట్టంపై పునరాలోచన చేసి ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై టీజే కెనడీ, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం బార్ అసోసియేషన్ల ప్రతినిధులు, మహిళా న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

యువతే దేశానికి విలువైన సంపద

- ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

స్వామి వివేకానందుని మాటలు తారకమంత్రాలుగా భావించి స్వశక్తితో ఎదిగే ప్రయత్నం చేస్తే యువత దేశానికి విలువైన సంపదగా నిలుస్తారని పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యులు ఎంవి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవ పథకం, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం సమన్వయ కర్త మణికంఠతో కలిసి ఆయన స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆశయాలతో దేశ అభివృద్ధికి పాటుపడాలన్నారు. యువత స్వతంత్రంగా ఎదిగేందుకు అవకాశాలను సృష్టించుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ మేనేజర్ సుబ్బరాయుడు, ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు టి చంద్రశేఖర్, డా ఎస్ పి వెంకటరమణ, కె. శ్రీనివాసరావు, వి లాజర్, వసు గోవర్ధన్‌రెడ్డి, గంగయ్య, వైవీయూ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. **స్టెప్ ఆధ్వర్యంలో..** జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో శుక్రవారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి. బ్రహ్మయ్య, స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ పూలమాలవేసి నివాళులర్పించారు కార్యక్రమంలో ఇండియన్ రెడ్ కాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ అధికారులు గోవిందరెడ్డి, షకీలా బేగం, కళాశాల సిబ్బంది, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **బాల వికాస్ స్కూల్లో..** కడప నగరం ఎర్రముక్క పల్లిలో ఉన్న బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ బి. గంగయ్య స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడులో..** మండల పరిధిలోని చిన్న గురవలూరు గ్రామంలోని శ్రీ స్వామి వివేకానంద పాఠశాలలో కరస్పాండెంట్ బి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో..** యువతకు ఆత్మవిశ్వాసమున్నట్లయితే ఎంతటి కష్టమైనా కార్యాన్ని అయినా సాధించవచ్చని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీమ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో స్వామి వివేకానంద స్వామి జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గురువి రెడ్డి, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగముని రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి. సచిదేవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, ఏవో శ్రీ రమణ మూర్తి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ లు డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష, డాక్టర్ లీలా వర్ధిని, భోజన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** స్వామి వివేకానంద జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు మస్తాన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్వామి వివేకనందా161వ జయంతి సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ తరపున పాల్గొన్న పెద్దలు వివేకానందుని జీవితాన్ని, చికాగోలో ప్రసంగించిన అంశాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, శివగణపతి, రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్

బకాయిలు చెల్లించే వరకూ పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను చెల్లించే వరకు పోరాటం ఆగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు హెచ్చరించారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ నిర్మాతల్లో ఒకరైన మైనేని వెంకటరత్నం 33వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని, గత ఎన్నికలకు ముందు ప్రకటించి, ఉద్యోగులు అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి సర్కార్, ఉద్యోగుల పట్ల కక్షపూరిత చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును సైతం ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించి ఉద్యోగుల అవసరాల కోసం చెల్లించకపోవడం తగదని చెప్పారు. ఉద్యోగులు కూడబెట్టుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్మును ఉద్యోగులకు తెలియకుండానే వాడుకున్న చరిత్ర ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తాము దాచుకున్న సొమ్ము నుంచి తమ పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, గృహ నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం రుణాలకు దరఖాస్తు చేస్తే నెలల తరబడి చెల్లింపులు లేవని పేర్కొన్నారు. . తమ బకాయిలను చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ నెల 14న భోగిమంటలలో ప్రభుత్వ విధానాలను, నిర్లక్ష్యాన్ని దహించే విధంగా వినూత్నంగా కార్యక్రమాలను చేపడతామని, 19న పట్టణ, తాలూకా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. 24న జిల్లా కేంద్రంలో ప్రదర్శనలు, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ తీర్మానించిందన్నారు. వీటిని జయప్రదం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు కె.చెన్నయ్య, సి.శ్రీనివాసులు, సి.వి.రమణ, వి.పర్వీన్, ఎ.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిరాజా

ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

కడప అర్బన్ : మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన ఉర్దూ మీడియం సిఇడిఎం ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్‌ను ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజద్ బాషా శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ఎస్ఎస్‌సి విద్యార్థులందరికీ ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించేందుకు స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిఇడిఎం డైరక్టర్ మస్తాన్‌వలి, అసోసియట్ మునీర్, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ , రూట రాష్ట్ర నాయకులు ముహమ్మద్ అయ్యూబ్ , హాజి హకీం సాహేబ్, సయ్యద్ సిరాజుద్దీన్, అఫ్జల్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకిర్ హుసేన్ పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇస్తే పాలకునిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని జమ్మలమడుగు టిడిపి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వలసపల్లిలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని టిడిపి నాయకులు బాణాసంచా, డప్పు వాయిద్యాలతో, పూలమాలలతోఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ వివరించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండలం ఇన్‌ఛార్జి దేవగుడి జయరాం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఎర్రగుంట్ల మండలం తెలుగుదేశం పార్టీ బాధ్యులు మోహన్ రెడ్డి, వలసపల్లె గ్రామ నాయకులు భవనం వెంకట్రామిరెడ్డి, జంగా వెంకటరామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, చిన్న వెంకటసుబ్బయ్య, నాగరాజు, రామాంజనేయులు, పెద్ద వెంకటసుబ్బయ్య,కేశవ్,నాగేంద్ర, మురళి, రవి, ఉగయ్య, వెంకటసుబ్బయ్య, సురేష్, ప్రసాద్, పవన్ కళ్యాణ్, రామాజీ, అంకల్, సుబ్బరాయుడు, సంజీవ్, రాఘవేంద్ర రెడ్డి, రవి, జనసేన పార్టీ మండల ఇన్‌ఛార్జి జగదీష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి -ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలం పరిధిలోని బి.కొత్తపల్లెకు చెందిన తవ్వా సుబ్బరామిరెడ్డి, తవ్వా సుదర్శన్ రెడ్డి, తవ్వా చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బా౦డ్డిలతో పాటు యాభై కుటుంబాలవారు వైసిపి నుంచి టిడిపిలోకి చేరారు. వీరికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు నేషనల్ హైవే (ఎన్‌హెచ్ 440) నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణపై రైతులతో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు పాల్గొని భూసేకరణలో రైతులకు నష్టపరిహారాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పెదనపాడు, కోడూరు, ఎర్రగుంట్ల, హనుమనగుత్తి, పొట్లదుర్తి గ్రామాలకు సంబంధించిన భూములు రైతులు కోల్పోతున్నారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారాన్ని నిర్ధారించినట్లు తెలిపారు. పెదనపాడు గ్రామానికి సంబంధించి సుమారు ఎకరాకు రూ. 10. 60 లక్షలు కోడూరు గ్రామానికి సంబంధించి రూ. 22 .50 లక్షలు, ఎర్రగుంట్లకు సంబంధించి రూ. 31.65 లక్షలు, హనుమన గుత్తి గ్రామానికి సంబంధించి రూ. 17. 45 లక్షలు, పొట్లదుర్తి గ్రామానికి సంబంధించి రూ. 23 .10 లక్షలు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఏదేని గ్రామానికి సంబంధించి వ్యవసాయతర భూమిగా మార్పిడి చేసుకున్న రైతులకు ఇళ్ల స్థలాల ధర ప్రకారం నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకున్న రైతులు రెవెన్యూ డివిజనల్ అధికారి జారీ చేసిన ఆర్డర్ పత్రాలు కలిగి ఉండాలని, వ్యవసాయతర భూములలో అమ్మకాలు జరిగినట్లు పత్రాలు లేదా లీజుకు ఇచ్చినట్లు పత్రాలు ఉండాలని నిబంధనలు ఉన్నాయని, అటువంటి భూములను వ్యవసాయతర భూములుగా పరిగణలోనికి తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎన్ హెచ్ ఎఇ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో 14 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక శిల్పారామం లో ఆయన సిబ్బందితో కలిసి సంక్రాంతి సంబరాల పోస్టర్లు ఆవిష్కరించారు అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 14 మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రభాకర్ విల్లాస్ వారి సహకారంతో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం గాలిపటాల పండుగ సందర్భంగా శిల్పారామంకు విచ్చేసిన చిన్నారులకు గాలిపటాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. 6 గంటలకు భోగి మంటలు కార్యక్రమం అనంతరం శ్రీ రాజా కళానిలయం చిన్నారులచే నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యువ రాజా డాన్సింగ్ పాఠశాల చిన్నారులు జానపద సినిమా పాటలకు నృత్యాలు, పులివెందుల మహేష్ ఎస్కే ఫిలిం డాన్స్ స్టూడియో, కదిరి మనోజ్ డాన్స్ అకాడమీ చిన్నారులచే జానపద సినీ నృత్యాలు ప్రదర్శనలు ఉంటాయన్నారు.

'ఉపాధి' పనులపై బహిరంగ సభ

ముద్దనూరు : మండల వ్యాప్తంగా ఉపాధిహామీ చట్టం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రిసైడింగ్ ఆఫీసర్, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ, జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయులు రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో 200 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనుల్లో రూ. 7.23. కోట్లు ఖర్చు చేసినట్లుగా గురితంచామని అధికారులు పేర్కొన్నారు. ఇందులో ఉపాధిలో రూ. 5.49 కోట్లు పంచాయతీ రాజ్ శాఖలో రూ. 1.73 కోట్లు పనులు చేసి ఖర్చు చేసినట్లుగా రికార్డులు గుర్తించినట్లు చెప్పారు. సామాజిక తనిఖీల్లో భాగంగా ఉపాధిహామీ పనుల్లో రూ 2,4788, పంచాయతీ రాజ్‌లో రూ. 47,500 గుర్తించి రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ నగదును పంచాయతీ రాజ్ కమిషనరుకు చెల్లించినట్లు ఎపిఒ గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయ భాస్కర్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, హౌసింగ్ ఎఇ రవికుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల కోసం డ్వాక్రా మహిళల ఆందోళన

లింగాల : తమకు కొత్త రుణాలు మంజూరు చేయలేదని డ్వాక్రా మహిళలు శుక్రవారం స్థానిక ఎపిజిబి ఎదుట ఆందోళన చేపట్టారు. లింగాలలోని 24 డ్వాక్రా గ్రూపుల సంఘాలకు కొత్తగా రుణాలు మంజూరు చేస్తామని రెండు నెలల కిందట చెప్పారని, ఇంతవరకు ఇవ్వలేదని మహిళలు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బ్యాంకు మేనేజర్ జ్ఞానమూర్తి మహిళలకు సర్దిజెప్పే ప్రయత్నం చేశారు. వారు ససేమిరా అనడంతో ఇన్‌ఛార్జి ఎస్ఐ హనుమంతు మహిళతో మాట్లాడారు. తమకు రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారో కచ్చితంగా చెప్పేదాకా ఆందోళన విరమించబోమని తెగేసి చెపారు. దీంతో ఎపిజిబి రీజనల్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 17న బ్యాంకుకు వచ్చి మహిళలతో మాట్లాడుతానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

దుర్భాషలాడడం హేయం : టిడిపి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఎసిబి కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు అధికారులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అధికారం చేతుల్లో పెట్టుకుని శాసనసభ ద్వారా చట్టాలు మార్చగల ప్రభుత్వం, ఇలా దుర్భాషలాడటం తప్పు అని ప్రొద్దుటూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.వి. పవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు తీరు రాష్ట్రవ్యాప్తంగా సర్వత్ర చర్చనీయాంశంగా మారిందన్నారు. అధికారులు కూడా ముక్కును వేలేసుకునే విధంగా అభద్రతాభావాన్ని కల్పిస్తూ చేసిన వ్యాఖ్యలు, తీవ్ర పదజాలం ఉపయోగించి ముద్దాయిని బయటికి తీసుకు వచ్చిన తీరును ఆయన తప్పు పట్టారు. అధికారులను తీవ్ర పదజాలంతో దూషించడమే కాకుండా, వారి ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేనే తప్పు పట్టారని, మద్యపాన విధానాన్ని అమలు చేసింది వైసిపి ప్రభుత్వమేనని, ఇది ఎమ్మెల్యే రాచమల్లు మరిచారా అని ప్రశ్నించారు?. గడచిన నాలుగున్నరేళ్లలుగా పాలసీని తప్పు పడితే ఎలాగాని, ఎస్‌పి స్థాయి అధికారిని ఎమ్మెల్యే రాచమల్లు దుర్భాషలాడుతుంటే పోలీసు సంఘాలు ఏమి చేస్తున్నాయి? అంటూ ప్రశ్నిచారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రాచమల్లు వ్యాఖ్యలపై పోలీసు సంఘాలు స్పందించి, తక్షణం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా చట్ట పరిధిలో పనిచేస్తున్న అధికారులకు స్వేచ్ఛను కల్పించాలని వారిపై బెదిరింపులకు పాల్పడకూడదని హితువు పలికారు. ఈ సంఘటనపై వెంటనే ప్రొద్దుటూరు ఎఎస్‌పి ఎన్నికల సంఘానికి, అలాగే ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే రాచమల్లు తీరుపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు



ఎస్ఐగా బాధ్యతలు చేపడుతున్న కొండారెడ్డి

ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆర్.వి కొండారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏవైనా సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బెల్ట్ షాపుల నిర్వహణ, అక్రమ ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల ఎస్ఐగా పనిచేస్తున్న మైనుద్దీన్ ముద్దనూరు పోలీస్ స్టేషన్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో పలువురు ఎస్ఐలను ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీసు అధికారులు బదిలీ చేశారు.

అక్రమంగా ప్రభుత్వ చెట్లు నరికివేత

ప్రజాశక్తి-కాశినాయన



చెట్లు నరికిన దుండగులు

మండల పరిధిలోని పిట్టి గ్రామం, దళితవాడ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో చింత చెట్లను అధికార పార్టీ నాయకులు మిషన్లతో నరికేశారు. గ్రామస్తుల వివరాల మేరకు.. చింతచెట్లు సుమారు వంద సంవత్సరాల నుంచి ఉన్నాయని వీటి వల్ల వచ్చే ఫలాలు స్థానికులు ఎంతగానో ఉపయోగించుకునేవారేని చెప్పారు. ఈ చెట్ల వల్ల చల్లటి వాతావరణం ఇక్కడ ఉండేదని అలాంటి వాటిని నరికి వేయడం చాలా బాధాకరమని గ్రామస్తులు వాపోయారు. విషయం తెలుసుకున్న విఆర్ఒ అక్కడి వచ్చే సరికి నాలుగు చెట్లు పూర్తిగా నరికేశారు. మిగిలిన ఒక్క చెట్టు నరకుతుండగా విఆర్ఒ వచ్చి నిలుపుదల చేశారు. ఓ వైపు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయం చేసి ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటుతుంటే, మరో వైపు అధికార పార్టీ నాయకులే దౌర్జన్యంగా ఈ విధంగా ఎలాంటి అనుమతి లేకుండా చెట్లు కొట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు వాపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఈ విషయంపై తహశీల్దార్ రామచంద్రుడు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధన ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు

క్రైం కార్నర్

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న రాణితోపు వద్ద గజ్జల వెంకట రమణ రెడ్డి(69) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు మేరకు.. వేముల మండలం పెండ్లురూ గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డికి ఇద్దరు సంతానం. కొనేళ్ల కిందట వెంకట రమణరెడ్డి తన భార్యతో కలిసి పెద్ద కొడుకు ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. కుటుంబ సంబంధించి కొన్ని కారణాలతోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని , మృతుడి భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మీరు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద టిప్పర్ ఢీకొని దస్తగిరి (75) అనే వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. మృతుడు తన సైకిల్‌పై ముద్దనూరు - కడప రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా టిప్పర్ బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో వృద్ధుడు కిందపడ్డాడు. వెంటనే టిప్పర్ అతనిపై నుంచి వెళ్లడంతో పొట్ట పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫోటో : టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందిన దస్తగిరి

12 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గాజులపేట సమీపంలో పేకాట ఆడుతున్న 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం గాజులపేట సమీపంలో జూదం ఆడుతున్న వారిపై ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో దాడులు చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ 25, 600 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న రామసుబ్బారెడ్డి అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్లు ఇలా..
రాకపోకలు ఎలా?

అధ్వానంగా రహదారులు
ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు



అధ్వానంగా హనుమనగుత్తి రోడ్డు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు ఇలా ఉంటే తాము ఎలా రాకపోకలు సాగించాలని పలువురు వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు అతుకులు, గతుకులు, గుంతలమయ్యంగా మారడంతో వాహన చోదకులు, రైతులు, ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నాయని ప్రజలు, ప్రయాణికులు అంటున్నారు. మరమ్మతులు చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు మాటలు చెబుతున్నారే తప్ప ఆచరణ శూన్యమని వాహనదారులు తెలుపుతున్నారు. రోడ్లపై ఉన్న పెద్ద పెద్ద గుంతలు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

అధ్వానంగా ఆర్‌టిపిపి రోడ్డు..

రాష్ట్రంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన పరిశ్రమ రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం. అటువంటి పరిశ్రమలో కొన్ని వందల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉద్యోగులు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి రోజూ తమ విధులు నిమిత్తం కర్మగారానికి చేరుకుంటారు. ఇలా నిత్యం వందల మంది ప్రయాణించే ఆర్‌టిపిపి-ప్రొద్దుటూరు రోడ్డు గుంతలతో అధ్వానంగా ప్రమాదకరంగా ఉంది. ఆర్‌టిపిపి నుంచేగాక చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు కూడా నిత్యం ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. ఆర్‌పిపి నుంచి ప్రొద్దుటూరుకు పట్టుమని పది కిలోమీటర్లు కూడా లేని రహదారిలో ప్రయాణించాలంటే దాదాపు 30 నిమిషాల నుండి 45 నిమిషాల సమయం పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఆ మేరకు రోడ్డు ఏ పరిస్థితుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షాకాలంలో రోడ్డు ఎక్కడ ఉందో, గుంతలు ఎక్కడ ఉన్నాయో కూడా కనిపించక చాలామంది ప్రమాదాల బారిన పడ్డారని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం రోడ్డు పరిస్థితి ఇంకా దారుణంగా ఉందని పెద్ద వాహనం రోడ్డు వెంబడి వెళితే వెనుక వచ్చే వాహనాలకు దుమ్ముతో రోడ్డు కూడా కనిపించడం లేదని, ఈ రోడ్డు గుండా ప్రయాణిం చాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు అర్జీలు ఇచ్చి మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా హనుమనగుత్తి రోడ్డు..

అప్పటి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హయాంలో 2010-11 సమయంలో హనుమనగుత్తి నుంచి ఎర్రగుంట్లకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దాదాపు 13 ఏళ్ల కావస్తున్నా ఇప్పటి వరకు కనీసం మరమ్మతులకు కూడా రోడ్డు నోచుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ రహదారి గుండా బిస్మిల్లా బాద్, హనుమన గుత్తి, వెంకన్నపల్లె గ్రామస్తులు రెవెన్యూ, ఎంపిడిఒ కార్యాలయం, సమీప పొలాలకు, ఎర్రగుంట్ల పట్టణానికి ప్రజలు తమ అవసరాల నిమిత్తం నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్డు గుంతలమయం కావడంతో గులకరాళ్లు పైకి తేలి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేటప్పుడు గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు.

నివేదికలు పంపాం

హనుమనగుత్తి, ఆర్‌టిపిపి రోడ్లకు సంబంధించి ప్యాచ్ వర్క్ పనులకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టి, త్వరిత్తగతిన పూర్తి అయ్యేలా చూస్తాం.

- అభిలాష్, ఆర్అండ్‌బి ఎఇ.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కెఎల్‌ఎం కళాశాలలో భోగి మంట వేసి నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



సంక్రాంతి సంబరాల్లో పిఆర్‌ఆర్ఎం కళాశాల విద్యార్థినులు

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కన్నుల పండువగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, హరిదాసులు, గంగిరెద్దులు, సంప్రదాయ వంటకాలు, భోగి మంటలు, పతంగులు, మరెన్నో విద్యార్థినులను అలరించాయి. ముందుగా భోగి మంటలు వేసి కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి వేడుకలను ప్రారంభించారు. తర్వాత ముగ్గుల పోటీలు, కోలాటం నిర్వహించారు. తర్వాత భోగి పండ్లు, సంప్రదాయ వంటకాలు వడ్డించారు. తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కరస్పాండెంట్ రాజేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు **కెఎస్ఆర్ఎంలో..** తెలుగు ప్రజలకు, వారి సాంప్రదాయాలకు, నెలవు సంక్రాంతి పండుగ అని కందుల విద్యా సంస్థల కరస్పాండెంట్, ట్రెజరరీ కందుల రాజేశ్వరమ్మ అన్నారు. కళాశాల కల్చరల్, ఫెస్టివిటి సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. . ముందుగా పాలు పొంగించి చక్కెర పొంగలి, భోగి మంటలు, రంగవల్లి, ముగ్గుల పోటీలతో పాటు, గాలి పటాలు ఎగుర వేసి సందడి చేశారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల బాధ్య ప్రిన్సిపల్ డాక్టర్ జి. హేమలత, ప్రోగ్రాం కన్వీనర్ లీనా రాస్థాపూర్, కోఆర్డినేటర్స్ డాక్టర్ బి. వీరశంకర్, జి. బి.వీరేష్, బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **పిఆర్ఆర్ఎం కళాశాలలో** పి రామిరెడ్డి మెమోరియల్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, రంగోలి, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా పాలు పొంగించే కార్యక్రమం నిర్వహించారు. భోగి మంటలను వేసి విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పి ఆర్ ఆర్ ఎం కళాశాల ప్రిన్సిపల్ నెల్సన్, ఆక్టివ్ స్టాఫ్ నరసింహారావు, మనోహర్, రాజారాం, సుచరిత, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి జిల్లా ప్రజలకు, అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి- చాపాడు



పోరుమామిళ్ల : విజేతగా నిలిచిన నాగలకుంట్ల సచివాలయం టీమ్

మండల స్థాయిలో కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. అన్నవరం గ్రామంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను మూడు రోజులుగా ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం 6 టీములు పోటీలలో పాల్గొన్నాయి. శనివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. క్రీడా పోటీలలో యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చాపాడు -లక్ష్మీపేట, వెదురూరు - అన్నవరం, సోమాపురం - పెద్ద గురువలూరు గ్రామాల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి శ్రీనివాసులు రెడ్డి ధనేశ్వర్ బాబు, శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్లు రాజసింహ హసీనా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలసపాడు:** మండలంలోని చెన్నారెడ్డిపల్లె ఆర్‌సిఎం పాఠశాలలో అన్ని సచివాయల పరిధిలోని క్రీడాకారులకు శుక్రవారం ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపిడిఒ మహబూబ్‌బీ, ఇఒపిఆర్‌డి మురారీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో పిఇటిలు సుమన్, రవిచంద్ర, రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** మండల స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలలో నాగలకుంట్ల సచివాలయం 62 పరుగులతో గానుగపెంట సచివాలయం పై విజయం సాధించి నియోజక వర్గ పోటీలకు అర్హత సాధించారు. మొదట బ్యాటింగ్ చేసిన నాగలకుంట్ల 8 ఓవర్లలో 111 చేశారు. బ్యాట్స్‌మెన్ హుస్సేన్ 81 పరుగులతో అజేయంగా నిలిచాడు. తరవాత బ్యాటింగ్‌కు దిగిన గానుగ పెంట 8 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. గెలిచిన నాగల కుంట్ల ఆటగాళ్లను మండల ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్ర శేఖర్, ఎంపిడిఒ వర ప్రసాద్ రావు, ఎంఇఒ రత్న స్వామి, పిఇటిలు భాస్కర్ రెడ్డి, రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, సంచర్ల పంచాయతీ సర్పంచ్ దస్తగిరి, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్‌రెడ్డి అభినందించారు. **లింగాల :** మండలంలో ప్రభుత్వం నిర్వహిస్తున్నప ఆడదాం ఆంధ్ర క్రీడలు శుక్రవారం ముగిశాయి. గత నెల 10న సచివాలయం స్థాయిలో నిర్వహించగా 26 నుంచి మండల స్థాయిలో నిర్వహించారు. శుక్రవారం ముగింపు సందర్భంగా ఈ క్రీడల్లో విజేతగా నిలిచిన వారికి క్రికెట్‌లో మొదటి బహుమతి రూ. 3000, కబడ్డీలో మొదటి బహుమతి రూ. 2000, ఖోఖో, వాలీబాల్, ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ఎంపీపీ లక్ష్మీదేవి ప్రదానం చేశారు కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, కడప పార్లమెంటు సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు

సురభి నాటకోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వేంపల్లె

సంక్రాంతి పండగను పురష్కరించుకొని పులివెందులలో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలకు చెందిన పోస్టర్లను శుక్రవారం వేంపల్లెలోని బాలుర పాఠశాల ఆట స్థలంలో ఎంపిడిఒ సంపతి దివిజా, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఇఒపిఆర్డీ మల్లికార్జున రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, ఎస్ఐలు మాట్లాడుతూ సురభి నాటకాలు పులివెందులలోని రాణితోపులో ఈనెల 13 నుంచి 18 వరకు నిర్వహి ంచనున్నామని చెప్పారు. సంక్రాంతి సంబరాల్లో నాటక ప్రదర్శన చేపట్టడంతో ప్రజలందరూ ఉల్లాసంగా తిలకించేందుకు అవకాశం ఉందని చెప్పారు. అంతకు ముందు మండలంలోని కుప్పాలపల్లిలో కూడ సురభి నాటక గోడ పత్రికలను ఎంపి అవినాష్ రెడ్డి, వేంపల్లె జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, పులివెందుల ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు.

నేటి నుంచి వెదురూరులో సంక్రాంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు : జిల్లాలో పెన్నా, కుందూ నదుల సంగమ ప్రాంతమైన మండల పరిధిలోని వెదురూరు వద్ద ఆది మునీశ్వరులచే నిర్మింపబడిన శ్రీ పార్వతీ దేవి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థాన ఆవరణంలో శనివారం నుంచి మంగళవారం వరకు 4రోజుల పాటు మకర సంక్రాంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి శివ సాయి ఈవెంట్స్ నెల్లూరు వారిచే మ్యూజికల్ నైట్ సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం శివ లీలలు భక్తి రస నాటకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16న గ్రామోత్సవం, చెక్కభజన, బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఇఒ డి వెంకట రమణారెడ్డి ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

16 నుంచి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - మైదుకూరు

సంక్రాంతి పండుగకు సొంత ఊరికి వచ్చిన ప్రయాణికులకు తిరుగు ప్రయాణం నిమిత్తం మైదుకూరు డిపో నిమిత్తం ఈనెల 16 నుంచి హైదారాబాదు, బెంగళూరు, విజయవాడలకు ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సాధారణ ఛార్జితో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మైదుకూరు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకోవాలనే ప్రయాణికులు 9885448199 ఫోన్ ద్వారా సంప్రదించి టికెట్లను ఆన్‌లైన్ రిజర్వేషన్ చేయించుకోగలరని తెలిపారు. పుష్య పౌర్ణమి సంధర్భంగా ఈ నెల 24న అరుణాచలానికిబప్రత్యేక ప్యాకేజీ సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కుప్పాలపల్లెలో వైఎస్ఆర్ పాల వెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ

వైసిపి పాలనలో గ్రామాలాభివృద్ధి : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందతున్నాయిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లె, కుప్పాలపల్లె గ్రామాల్లో కోట్లాది రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా, వైఎస్ఆర్ పాల వెల్లువ భవనాలను ఆయన ప్రారభించారు. అలాగే అశోక్ నగర్‌లో లబ్ధిదారులకు భూమి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లోనే సచివాలయాలు నిర్మించి ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోనే సచివాలయాలు నిర్మించి ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మరో సారి సిఎం చేస్తే మరింతగా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను జగనన్న ప్రభుత్వం అమలు చేసినట్లు చెప్పారు. నవరత్నాలు ద్వారా ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా జగనన్న ఆదుకున్నారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం తాళ్ళపల్లె, కుప్పాలపల్లె, అశోక్ నగర్ ప్రాంతాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పులివెందుల ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి, కుప్పాలపల్లె సర్పంచ్ బంక లక్ష్మి దేవి, వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ యాదవ్, సొమేశ్వరరెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, భారతి, రహంతుల్లా ఖాన్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, మండల కొఆప్షన్ మెంబర్ అసనయ్య మటన్ బాబా, రామగంగిరెడ్డి, పిఆర్ డిఇ రవిచంద్రారెడ్డి, ఎంపిడిఓ సంపతి దివిజా, ఇఓపిఆర్డి మల్లికార్జున రెడ్డిలతో పాటు పలువురు వైకాపా నేతలు, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి పశువులకు చేటు

ప్రజాశక్తి - చాపాడు



దూడలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి మహమ్మద్ గౌస్

పశువులు, గొర్రెలు, మేకలు మొదలయిన జంతువుల్లో సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు చాలా ప్రధానమైందని ఈ వ్యాధి చాలా చేటు అని మండల పశువైధ్యధికారి మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. ప్రస్తుతం మండల పరిధిలో గాలికుంటు టీకాల కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 23100 డోస ల గాలికుంటు టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈనెలలో పూర్తిగా టీకాలు వేయాలనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. సిబ్బందిని టీములుగా ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నామన్నారు. ఈ వ్యాధి సోకడం వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ, పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గి తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుందని ఆయన చెప్పారు. ఈ జబ్బు సోకిన పశువుల పాలు తాగి దూడలు మరణిస్తాయన్నారు. ఈ వ్యాధి యుక్త వయస్సులో ఉన్న పశువుల్లో, వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్న పశువుల్లో, దేశవాళీ పశువుల కన్నా సంకరజాతి పశవుల్లో ఎక్కువగా సోకుతుందన్నారు. ఈ వ్యాధి పశువులకు సోకి గాలి, ఇతర మార్గాల ద్వారా అతివేగంగా ఇతర పశువులకూ వ్యాపించే ఒకానొక తీవ్రమైన వైరల్ వ్యాధి అని చెప్పారు. ఈ గాలిని ఆరోగ్యవంతమైన పశువులు నోటి ద్వారా గాని, ముక్కుద్వారా గాని పీల్చినపుడు వ్యాధి సంక్రమణకు కారణమవుతుందన్నారు. పాల ద్వారా దూడలకీ, పాల ట్యాంకుల ద్వారా వేరే పశువులశాలలకు వ్యాధి వ్యాపిస్తుందన్నారు. వ్యాధి సోకిన పశువులు తిన్న గడ్డి ద్వారా, ఈ వ్యాధి కలిగించే వైరస్‌లు ఎండాకాలంలో ఎండిపోయిన పేడలో అయితే 14 రోజులు, చలికాలంలో ఉండే పేడలో ఆరు నెలలు, మూత్రంలో 39 రోజులు, మట్టిలో అయితే ఎండాకాలంలో మూడు రోజులు, చలికాలంలో 28 రోజులు బతకగలదన్నారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బంది రోజూ టీకాలు వేస్తున్నారని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి'

ప్రజాశక్తి - కడప అర్బన్



కరపత్రం అందజేస్తున్న సలావుద్దీన్

ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు ఒక అవకాశం ఇవ్వాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రవీంద్ర నగర్‌లో ఉన్న షహమీరియ మస్జిద్ దగ్గర కరప త్రాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.

పనులు వేగవంతం చేయాలి : కాంగ్రెస్

కడప : నగరంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీ పనులు వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కడప నగరం కృష్ణ సర్కిల్ నుంచి దేవుని కడప రోడ్డు వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించి ప్రజలు, వ్యాపారుల ఇబ్బందులను, కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 2021లో కృష్ణాసర్కిల్ నుంచి దేవుని కడప వరకు అభివృద్ధి చేయ డానికి ప్రభుత్వం రూ. 100.51 కోట్ల నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ప్రస్తుత, భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను తీర్చడానికి కడప నగర ప్రణాళికలో భాగంగా డ్రెయినేజీ, ఫుట్‌పాత్, అభివృద్ధి, ప్లాంటేషన్‌తో కూడిని సెంట్రల్ మీడి యన్లతో సహా అభివృద్ధి చేయడం ప్రభుత్వ ఉద్దేశమని, కానీ క్షేత్రస్థాయి పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, దీనివల్ల పాదాచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మాజీ కార్పొరేటర్ రహమతుల్లా ఖాన్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, అఖిల్, ఉమర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముద్దనూరు : విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ మరమ్మతులు కారణంగా మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరాజువర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఎఇ కోరారు.